

వసతిగృహాల్లో పనిచేయని వాటర్ హీటర్లు

- ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- ఈ చలికాలం చన్నీరే దిక్కు
- విద్యార్థుల గోడు పట్టేదెవరికి

బెజ్జూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రెండు మూడు రోజుల నుంచి చలి పెరుగుతోంది. మరో వారం రోజుల్లో చలితీవ్రత మరింతపెరిగే అవకాశం ఉంది. అయితే ప్రతి యేటా వసతిగృహాల్లో చదుకుంటున్న విద్యార్థులకు చన్నీటి స్నాన బాధలు తప్పడం లేదు. జిల్లాలో మొత్తం 46 ప్రభుత్వ ఆశ్రమగిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 14బాలికల ఆశ్రమపాఠశాలలు, 32బాలుర పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో చలి కాలంలో విద్యార్థుల సౌకర్యార్థం కోసం 2013లో సోలార్ వాటర్ హీటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇవన్నీ ఒకటి రెండేళ్లు మినహా పని చేసిన దాఖలాలు లేవు.

● వృథాగా మారిన నిధులు..

జిల్లాలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఒక్కోహీటర్‌కు ప్రభుత్వం రూ.2.25లక్షలు వెచ్చించింది. ఏడాది పాటు వాటిని ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ నిర్వహణ బాధ్యతను అప్పగించారు. కాంట్రాక్టర్ గడువు ముగియగానే హీటర్లను పట్టించుకున్న వారే కరువయ్యారు. చిన్న చిన్న సమస్యల తోనే వాటర్ హీటర్లు మూలనపడ్డాయి. చెడిపోయిన వెంటనే వాటికి మరమ్మతులు చేస్తే విద్యార్థులకు ఈ సమస్యలు ఉండేవి కావు. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వాటర్ హీటర్లు నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. హీటర్లలో సమస్యలేర్పడిన వెంటనే ఉన్నతాధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం చలికాలం నేపథ్యంలో చలి పెరుగుతోంది. దీంతో విద్యార్థులు మంచినీటి ట్యాంకుల వద్ద, చేతిపంపుల వద్ద గజగజ వణుకుతూ చన్నీటితో స్నానాలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్ హీటర్లను బాగు చేయిస్తే ఈ చలికాలం విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఇన్నాళ్లు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు, ప్రభుత్వానికి విన్నవించినా సమస్యను పట్టించుకోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైన ఆశ్రమ పాఠశాలలను పట్టించుకుని సమస్యలు పరిష్కరిస్తారని విద్యార్థులు గంపెడాశలు పెట్టుకున్నారు.

● చిన్న సమస్యలే..అయినా పట్టించుకోరు..

సోలార్ వాటర్ హీటర్లు చిన్నచిన్న కారణాలతోనే మూలనపడ్డాయి. మరికొన్ని పాఠశాలల్లో కోతులు వాటర్ హీటర్లకున్న పరికరాలను తొలగించాయి. దీంతో చలికాలంలో వేడినీరు లేక చన్నీటితో స్నానాలు చేసి అనారోగ్యం బారిన పడుతున్నామని విద్యార్థులు పేర్కొంటున్నారు. కనీసం ఈ సంవత్సరమైనా వాటర్ హీటర్లకు మరమ్మతులు చేయించాలని విద్యార్థులు కోరుతున్నారు.

చన్నీటితో ఇబ్బందులు పడుతున్నాం..

- శివకుమార్, విద్యార్థి, సలుగుపల్లి



ప్రతియేటా చాలికాలంలో చన్నీటి స్నానాలే దిక్కవుతున్నాయి. చలి ముదిరితే కొన్ని సందర్భాల్లో స్నానం చేయని పరిస్థితి ఉంటుంది. ఎన్నో ఏళ్లుగా సోలార్ హీటర్లను బాగుచేయాలని చెబుతున్నా పట్టించుకున్న వారే లేరు. కనీసం ఈ చలి కాలంలోనైనా వాటర్ హీటర్లకు మరమ్మతులు చేయించి మమ్మల్ని చన్నీటి స్నానాల నుంచి గట్టెక్కించాలి.

అధికారులు పట్టించుకోవాలి..

- నరేష్, విద్యార్థి, సలుగుపల్లి



సౌర పరికరాలను కోతులు పూర్తిగా ధ్వంసం చేశాయి. అవి ఏమాత్రం పనిచేయడం లేదు. దీంతో తాము చలికాలంలో చన్నీటి స్నానాలు చేయాల్సిందే. అధికారులెవరూ మా గోడును పట్టించుకోవడం లేదు. ప్రతి ఏటా చలి కాలంలో ఇదే పరిస్థితి. కనీసం ఈ చాలికాలంలోనైనా సోలార్ వాటర్ హీటర్లను మరమ్మతు చేయించి వాటిని కోతులు పాడు చేయకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్, అక్టోబరు 26: వచ్చేనెల2నుంచి 4వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే అండర్-19రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆసిఫాబాద్ తెలంగాణ సాంఘికసంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన వంశీకృష్ణ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యాదగిరి తెలిపారు. ఈసందర్భంగా వంశీకృష్ణను ప్రిన్సిపాల్‌తోపాటు పీడీలు, పీఈటీలు అబ్దుల్‌రహీం, సంతోష్, శంకర్, యాదగిరి, సురేందర్, మహేష్, బాబురావు అభినందించారు.

ఖానాపూర్ ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మొదటిసారిగా శనివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి నివాసానికి రావడంతో ఆమె ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కు, నాయకురాలు సరస్వతీపాల్గొన్నారు.

కనకరాజు మృతికి సీపీఎం సంతాపం


నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆసిఫాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ అవార్డు గ్రహీత, గుస్సాడీ కళాకారుడు కనకరాజు మృతికి శనివారం ఆసిఫాబాద్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆపార్టీ నాయకులు నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, దినకర్ పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతు పనులు ప్రారంభించిన ఎమ్మెల్సీ


కౌటాలలో రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

చింతలమానేపల్లి/కౌటాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జవెల్లి- గూడెం రోడ్డుకు, కౌటాల మండలకేంద్రం నుంచి వీర్దండి గ్రామం వరకు శనివారం ఎమ్మెల్సీ దండె విఠల్ మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎస్‌డీపీ నిధులకింద రూ.76లక్షలు తాత్కాలికమరమ్మతు పనులకు మంజూరైనట్లు తెలిపారు. జిల్లాలో రెండు నియోజకవర్గాలకు కలిపి రూ.3కోట్లచొప్పున నిధులు కేటాయించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలసంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. అనంతరం కేతిని గిరిజనఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీఎంపీపీలు నానయ్య, విశ్వనాథ్, నాయకులు హర్షద్‌హుస్సేన్, సిడాం గణపతి, శ్రీవర్ధన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తా

సిర్పూర్(టి): మండలంలోని చింతకుంట గ్రామంలోగల సేవలాల్ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్సీ దండెవిఠల్ అన్నారు. శనివారం సేవాలాల్ ఆలయంలో ఆయన ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంఎఫ్‌డీ నిధుల నుంచి రూ.5లక్షలు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ కాపీలను ఆలయకమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయఅభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని అన్నారు. ఆయనవెంట నాయకులు సిడాంగణపతి, ఈర్ల సత్యనారాయణ, మంగిలాల్, కిశోర్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

డిస్పెన్సరీ మందుల అమ్మకాలపై ఆర్‌జెడీ విచారణ


విచారణ జరుపుతున్న డాక్టర్ హేమలత

కాగజ్‌నగర్, అక్టో బరు 26: కాగజ్‌నగర్ ఈఎస్‌ఐ డిస్పెనర్సీ లోని మందులను బయట అమ్మిన ఫార్మాసిస్టు మురళిపై శనివారం ఈఎస్‌ఐ రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హేమలత విచారణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విచారణ జరిపి త్వరలోనే బాధ్యులపై చర్యలు తీసు కుంటామన్నారు. ఈమె వెంట ఈఎస్‌ఐ సూపరింటెండెంట్ డాక్టర్ జగన్ తదితరులున్నారు.

యువత క్రీడలపై ఆసక్తి చూపాలి: సీఐ

చింతలమానేపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): యువకులు క్రీడల పట్ల ఆసక్తిచూపాలని సీఐ ముత్యం రమేష్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన యువకులకు పోలీస్‌ఫ్లాగ్ డే సందర్భంగా ఎస్సై నరేష్‌తో కలిసి వాలీబాల్ కిట్లను అందజేశారు. యువకులు క్రీడల పట్ల ఆసక్తిచూపాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

నజ్రూల్‌నగర్‌లో ఉద్రిక్తత


విచారిస్తున్న ఎస్సై రామన్ కుమార్

కాగజ్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ విలేజీనెంబరు5లో శనివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఓ వర్గానికి చెందిన యువకుడు నజ్రూల్‌నగర్‌కు చెందిన యువతిని కలిసేందుకు శుక్రవారం రాత్రి వెళ్లాడు. గ్రామస్థులకు అనుమానం వచ్చి ఆరా తీయగా పొంతలేని సమాధానాలు చెప్తూ అనుమానాస్పదంగా వ్యవహరించటంతో శనివారం వేకువ జామున చెట్టుకు కట్టేశారు. ఈ విషయం ఒక్కసారిగా వైరల్ కావడంతో యువకుడిని విడిపించేందుకు శనివారం వేకువజామునే డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో సీఐలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస రావు, కాగజ్‌నగర్ పట్టణ, ఈసుగాం ఎస్సైలు రామన్‌కుమార్, దీకొండ రమేష్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి విషమించకుండా ఉండేందుకు చెట్టుకు కట్టేసిన యువకుడిని విడిపించే యత్నంలో తోపులాట జరిగింది. ఎస్సై దీకొండ రమేష్‌కు కంటికింద భాగంలో గాయాలయ్యాయి. అయినప్పటికీ యువకుడిని వాహనం ఎక్కించుకొని వస్తున్న క్రమంలో కొంతమంది వాహనానికి చెందిన అద్దాలు ధ్వంసం చేశారు. కాగా యువకుడిని అదుపులోకి తీసుకొని యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ విషయమై డీఎస్పీ రామనుజంను వివరణ కోరగా విలేజీ నెంబరు5లో జరిగిన సమస్య పూర్తిగా సద్దుమణిగినట్టు తెలిపారు. యువకుడిని అక్కడినుంచి తప్పించినట్టు తెలిపారు. చిన్నపాటి ఘర్షణ జరిగినట్టు తెలిపారు.

ఉపాధిహామీ వార్షిక ప్రణాళికపై గ్రామసభ

కెరమెరి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోయగాం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం 2024-25సంవత్సరం ఉపాధిహామీ పనులకు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మల్లయ్య రైతులకు కావాల్సిన పనుల వివరాలు అడిగి తెలు సుకున్నారు. వ్యవసాయక్షేత్రంలో చేపట్టే కందకాలు, నీటి కుంటలు, రాళ్లకట్టడాలు, పశువుల కొట్టాలు తదితర పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గతంలో నిర్మించుకున్న ఇంకుడుగుంతలు, మరుగుదొడ్లకు సంబంధించిన బిల్లులు నేటికి రాలేదని గ్రామస్థులు ఆయనకు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

లింగాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. శని వారం ఆయన మండలకేంద్రంలోగల కస్తుర్బా బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాతోపాటు రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. యస్‌ఏ1 పరిక్షలను విద్యార్థులు ఏవిధంగా రాస్తున్నారో పరిశీలించారు. మరు సటి సందర్శనలో విద్యార్థుల విద్యాప్రమాణాలను విషయాల వారీగా క్షుప్తంగా అడిగి తెలుసుకుంటానని అన్నారు.

హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది

బెజ్జూరు, అక్టోబర 26(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ కొలావార్‌ల హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆదివాసీ కొలవార్ రాష్ట్ర అధ్యక్షుడు బుర్సపోచయ్య అన్నారు. శనివారం మండలకేంద్రంలో కొలవార్(మన్నెవార్) సేవాసంఘం మండలకమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం కోసం అందరూ పనిచేయాలన్నారు. అన్నిరంగాల్లో కొలవార్‌లు వెనకబడి ఉన్నారని, అందరం సంఘటితమై ప్రతిసమస్యపై పోరాడాలని అన్నారు. కుమరం భీం, ఎడ్లకొట కొండ సాధించిపెట్టిన హక్కులు కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం భీమన్న ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బాబు, సంతోష్, వెంకటేష్, లలిత తదితరులు పాల్గొన్నారు.

అధికారిక లాంఛనాలతో గుస్సాడి కనకరాజుకు అంత్యక్రియలు


గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

జైనూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గుస్సాడి కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు మృతదేహానికి శనివారం మండలంలోని మార్లవాయిగ్రామంలో అధికారిక లాంఛనాలు, ఆదివాసీ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మబొజ్జు, మాజీఎమ్మెల్యే ఆత్రంసక్కు, కాంగ్రెస్‌పార్టీ ఆదిలాబాద్‌పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణక్క, మానవహక్కులవేదిక రాష్ట్రఅధ్యక్షుడు ఆత్రంభుజంగ్‌రావ్, సీపీఎం నాయకులు తదితరులు గుస్సాడి కనకరాజు మృతదేహంపై పూలమాలలువేసి ఘననివాళి అర్పించారు. ఆయనకు నివాళులు అర్పించేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధప్రాంతాల నుంచి ఆదివాసులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తరలివచ్చి వారిఅభిమానాన్ని చాటుకు న్నారు. అంత్యక్రియల్లో బీజేపీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కొట్నాక విజయ్‌కుమార్, జడ్పీమాజీఛైర్మన్ రాథోడ్ జనార్దన్, కుమరంభీం మనుమడు కుంరం సోనేరావ్, మాజీ జడ్పీటీసీ చారులత, మాజీ ఎంపీపీ కుంర తిరుమల, మాజీవైస్ ఎంపీపీ చిర్లేలక్ష్మణ్, గ్రామస్థులు, డీఎస్పీ కరుణాకర్, సీఐ రమేష్, ఎస్ఐ సాగర్, సార్మేడిలు ఆనంద్‌రావ్, జుగునాక దేవరావ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

ఘనంగా కుమరంభీం విగ్రహ ఆవిష్కరణ

జైనూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నాపూర్‌లో కుమరంభీం విగ్రహాన్ని శనివారం గిరిజన సాంప్రదాయాలతో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కుమరం భీం మనుమడు కుమరం సోనేరావు మాట్లాడారు. కుమరం భీం స్పూర్తితో ముందుకు సాగాలని, ఉద్యమాలతోనే ఆదివాసులకు హక్కులు లభిస్తాయని అన్నారు. ముఖ్యంగా ఆదివాసులు విద్యావంతులు కావాలని సూచించారు. అధునిక వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగు చేస్తూ అభివృద్ధికి బాటవేయాలన్నారు. ఆదివాసులు హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుమరం భీం స్పూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జడ్పీ మాజీచైర్మన్ రాథోడ్ జనార్ధన్, రాయిసెంటర్ల జిల్లా సార్మేడి మేస్రాం దుర్గు, తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు గోడం గోపిచంద్, గిరిజన నాయకులు మేస్రాం శేఖర్ తదితరులు కుమరంభీం విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివాసీ నాయకులు ఇంగ్లే కేశవ్‌రావ్, జనార్ధన్, మేస్రాం అంబాజీ రావ్, పెందుర్ లచ్చు, పెందుర్ లాల్‌శావ్, రాము, భీంరావ్, మాజీ సర్పంచ్ కందారె బాలాజీ, పూసం తుల్సీరాం, గ్రామస్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కుమరంభీం మనుమడు కుమరంభీం సోనేరావ్

ఇసుక సరఫరాకు అనుమతివ్వాలి


వినతి పత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కాగజ్‌నగర్, అక్టోబరు 26: ఇసుక రవాణాకు అనుమతివ్వాలని భవన నిర్మాణ కార్మికులు శనివారం సబ్‌కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాగజ్‌నగర్ పట్టణంలోని నెల రోజు నుంచి ఇసుక సరఫరా నిలిపివేయటంతో భవననిర్మాణ పనులు నిలిచిపోయాయన్నారు.

ఘనంగా పోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన

కౌటాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండల్‌హెట్టి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో శనివారం అమ్మవారి విగ్రహాన్ని ఘనంగా పునఃప్రతిష్ఠించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హత్య కేసును దారి మళ్లించి..రీ పోస్టుమార్టంలో అడ్డంగా చిక్కారు

- ఎస్సై, ఏఎస్సై, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్ల సస్పెన్షన్
- జిల్లాలో సంచలనం రేపిన కొట్రంగి శ్యాంరావు మృతి కేసు


ఎస్సై సోనియా

కాగజ్‌నగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం బురదగూడలో రెండునెలల క్రితం కొట్రంగి శ్యాంరావు మృతి కేసు జిల్లాలోనే సంచలనం రేకెత్తించింది. హత్య చేసినప్పటికీ సాధారణమృతి కింద కేసు నమోదు చేశారంటూ గ్రామానికి చెందిన ఓవ్యక్తి ఏకంగా 100కి డయల్ చేయటంతో దహనసంస్కారాలు చేయరాదని సీఐ శంకరయ్య, ఎస్సై సోనియా గ్రామానికి చేరుకొని పూర్తివివరాలు సేకరించారు. పోస్టుమార్టం చేయించి కేసు కూడా నమోదు చేసి కథను ముగించారు. ఇక్కడినుంచే అసలు కథ మలుపులు తిరిగింది. సాధారణ మృతికింద ఎస్సై సోనియా కేసు నమోదు చేశారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులందటంతో మృతదేహానికి రీపోస్టుమార్టం చేయించాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. అప్పటి ఆర్డీవో సురేష్‌కుమార్ సమక్షంలో రీపోస్టుమార్టం చేశారు. కొట్రంగి శ్యాంరావు మృతదేహంపై 12 గాయాలున్నట్లు, ఛాతికి మొద్దుబారిన గాయం ఉన్నట్లు తేల్చారు. సీఐ అల్లం రాంబాబు సమగ్ర నివేదికను డీఎస్పీ కరుణాకర్‌తోపాటు జిల్లాఎస్పీకి అందించారు.

పోస్టుమార్టం నివేదికలో హత్యఅని తేలటంతో పోలీసుఉన్నతాధికారులు ఈ కేసును తప్పుదారి పట్టించిన అప్పటి ఎస్సైసోనియాతోపాటు ఏఎస్సైమానును, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లపై సస్పెన్షన్‌కు వేటు వేశారు. ఈకేసును తప్పుతోవ పట్టించేందుకు ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో జిల్లా పోలీసు అధికారులు సీరియస్‌గా తీసుకొని నిజాలను నిగ్గు తేల్చారు. కాగా, ఈ కేసులో ఆదినుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్న కొట్రంగి శ్యాంరావు సోదరుడు కొట్రంగి సురేష్ హత్యచేసినట్టు పోలీసులు ఒక అవగాహనకు వచ్చారు. కొట్రంగి సురేష్ ఆర్మీ విభాగంలో సైనికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు ఆర్మీ విభాగానికి లేఖలు రాశారు. హత్యకేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంట్రంగి సురేష్‌ను పోలీసుకస్టడికి అప్పగించాలని కోరారు.


రీ పోస్టుమార్టం చేసేందుకు వచ్చిన అధికారులు(ఫైల్)

క్రైం కార్నర్

ప్రాణహితలో ముగ్గురు యువకుల గల్లంతు


జాహీర్ హుస్సేన్, ఇర్షాద్, మోహిజ్ (ఫైల్)

బెజ్జూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సోమిని సమీపంలోని ప్రాణహిత నదిలో స్నానానికి వెళ్లి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. మండల కేంద్రంలోని గోల్కొండ కాలనీకి చెందిన జాహీర్ హుస్సేన్(22), ఇర్షాద్(20), మోహిజ్(19)తో పాటు ఖాసీం నలుగురు కలిసి సోమిని సమీపంలోని ప్రాణహితనది ఎర్రబండ రేవు వద్ద స్నానానికి దిగారు. స్నానాలు చేసి బయటకు రాగా జాహీర్ హుస్సేన్, ఇర్షాద్, మోహిజ్ మరోసారి అక్కడే మరో చోట స్నానానికి దిగారు. ఒడ్డుపై ఉన్న ఖాసీం అక్కడ నీటిలోతు ఎక్కువగా ఉంటుందని వారించినా వారు వినలేదు. దీంతో నీటిలోతు తెలియక ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. ఈ విషయాన్ని ఖాసీం ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభించలేదు. ఘటనా స్థలానికి కౌటాల సీఐ ముత్యం రమేష్, బెజ్జూరు ఎస్సై విక్రమ్ చేరుకుని వివరాలు సేకరించారు. రాత్రి కావడంతో గాలింపు నిలిపివేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వారు తెలిపారు.

మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు ప్రాణహిత నదిలో గల్లంతు కావడంపై బెజ్జూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. గల్లంతైన వారిలో ఇర్షాద్, మోహిజ్‌లు ఇద్దరు అన్నదమ్ముల కొడుకులు కాగా జాహీర్‌హుస్సేన్ వరుసకు బావ అవుతాడు. చేతికందిన కొడుకులు గల్లంతుకావడంతో వారు రోదిస్తున్న తీరు కంటతడి పెట్టించింది.

తెప్ప బోల్తాపడి మత్స్యకారుడి మృతి


కిషోర్ (ఫైల్)

దండేపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కన్నెపల్లి గ్రామానికి చెందిన మగ్గిడి కిషోర్(35) అనే మత్స్యకా రుడు గూడెం గోదావరి నదిలో చేపలు పట్టేందుకు వెళ్లి తెప్ప బోల్తాపడడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. కిషోర్ ఈనెల 24న గోదావరి నదిలో చేపలు పట్టేందుకు ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయం త్రం వరకు కూడా ఇంటికి రాకపోవడంతో గోదావరి వద్ద, బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించ లేదు. మృతుడి భార్య పల్లవి శుక్రవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయ గా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శనివారం ఉదయం గూడెం గోదా వరి నదిలో కిషోర్ మృతదేహం నీటిపై తేలింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కాసిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కల్వరి చర్చి సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గని కార్మికులకు గాయాలైనట్టు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బెల్లంపల్లి కన్నాల బస్తీకి చెందిన వేల్పుల శ్రీకాంత్, పోతురాజుల సతీష్ కాసిపేట రెండో గనిలో విధులు ముగించుకొని బైక్‌పై బెల్లంపల్లికి వెళ్తుండగా కల్వరి చర్చి సమీపంలో నిలిపి ఉన్న స్కూల్ బస్‌కు వెనుక నుంచి ఢీకొట్టారని చెప్పారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య

లింగాపూర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంజరిగూడకు చెందిన నాగరగోజే శివాజీ(77) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన శివాజీ శుక్రవారం చేనుకు వెళ్లివస్తానని చెప్పి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చేను వద్దకు వెళ్ళి చూడగా ఉరివేసుకొని మృతి చెందాడు. మృతుడి కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్ట్

జైపూర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఇందారం గ్రామ శివారులో పేకాడుతున్న ముగ్గురిని పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ఓ రైసుమిల్లు పక్కన పేకాడుతున్నారనే సమాచారం మేరకు శనివారం మధ్యాహ్నం టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి దాడి చేయగా గోనె వసంత్ కువర్, కొత్తపెల్లి కృష్ణ అలియాస్ కిషన్, కామెర దుర్గయ్యలు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.23,270, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, ఏడుగురు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారని ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

బెజ్జూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సలుగుపల్లి గ్రామశివారు అటవీప్రాంతంలో పేకాటస్థావరంపై శుక్రవారం రాత్రి దాడి చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాపత్రాప్, ఎస్సై వెంకటేష్ తెలిపారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడిచేసి ఇద్దరిని పట్టుకున్నామని మరికొందరు పారిపోయారని పేర్కొన్నారు. రెండు ద్విచక్ర వాహనాలు, రూ.5200నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సాంబారులో పడి బాలుడికి గాయాలు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సాయినగర్‌కు చెందిన శ్యామ్‌కుమార్-శైలజల కుమారుడు వరణ్‌బాబు (3) ఈ నెల 21న వేడి సాంబారులో పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. దంపతులు ఓ చారిటబుల్ ట్రస్టులో వంట మనుషులుగా పని చేస్తున్నారు. రోజులాగానే వంట సిద్ధం చేసి పక్కన పెట్టారు. అక్కడే ఆడుకుంటున్న వరుణ్‌బాబు ప్రమాదశాత్తు సాంబారు గంజులో పడగా 60 శాతం మేర శరీరం కాలి తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబసభ్యులు మాతా శిశు ఆసుపత్రికి తరలించగా వరంగల్‌కు రెఫర్ చేశారు. బాలుడిని మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

అధికారుల తప్పిదం

9 ఏండ్ల కరెంట్ బిల్లు రూ.1.47 లక్షలు ఒకేసారి

చెన్నూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అధికారుల తప్పిదంతో ఇంటి కరెంటు బిల్లు ఏకంగా రూ.1,47,222 వచ్చింది. బిల్లు చూసిన వినియోగదారుడు సబ్‌స్టేషన్ ఎదుట గ్రామస్థులతో కలిసి శనివారం ఆందోళనకు దిగాడు. కొమ్మెర గ్రామానికి చెందిన గట్టు సంపత్‌గౌడ్ 2016లో ఇంటి కోసం కరెంటు మీటరు తీసుకున్నాడు. నాలుగు నెలల వరకు బిల్లు రాలేదు. పలుమార్లు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్ళాడు. ఈనెల 3న మీటర్ నంబరు 18107981 బిల్లు తీశారు. బిల్లు ఏకంగా రూ.1,47,222ల వచ్చింది. ఈనెల 17వ తేదీలోగా చెల్లించాలని, లేకుంటే 1వ తేదీన డిస్‌కనెక్షన్ చేస్తామని బిల్లులో పేర్కొన్నారు. సంపత్‌గౌడ్ అధికారులను అడుగగా బిల్లు చెల్లించాల్సిందేనని తేల్చి చెప్పారు. మీటర్‌ను ఆన్‌లైన్ చేయడంలో నిర్లక్ష్యం చేయడం వల్లే ఒకేసారి ఇంత బిల్లు వచ్చిందని, న్యాయం చేయాలని నిరసనకు దిగినట్టు సంపత్ పేర్కొన్నారు. ఏఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా మీటర్‌ను పరీక్షించేందుకు డీడీ చెల్లిస్తే చెక్ చేస్తామని పేర్కొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజంలో భాగస్వాములు కావాలి

కాసిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజంలో అందరూ భాగస్వాములు కావాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మాదకద్రవ్యాలను విక్రయించినా, కొనుగోలు చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీహర్ష డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం మంచిర్యాల గార్డెన్స్‌లో ఘనంగా జరిగాయి. చైర్మన్ పల్లె భూమేష్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో స్థిరపడ్డారన్నారు. ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థులకు మెమొంటోలను అందజేశారు.

వీధి కుక్కల బెడద


కాలనీల్లో తిరుగుతున్న కుక్కలు (ఫైల్)

● పట్టించుకోని అధికారులు ● ఆరు నెలల్లో 100మందికి పైగా కుక్కకాట్లు

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంతోపాటు, మండలంలోని పలుగ్రామాల్లో వీధికుక్కల దాటికి తట్టుకోలేక ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నిత్యం ఎక్కడో ఒకచోట వీధికుక్కలు హల్‌చేస్తున్నాయి. ఆరు నెలల్లో 100మందికి పైగానే కుక్కల దాడిలో గాయపడ్డట్లు పట్టణవాసులు పేర్కొంటున్నారు. వీధికుక్కల స్వైర విహారంతో విద్యార్థులు, పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. యాని మల్‌బర్త్ కంట్రోల్ పద్ధతి ద్వారా వీధి కుక్కలకు చెక్ పెట్టవచ్చని భావించినా కార్యరూపం దాల్చడం లేదనే ఆరోపణలున్నాయి.

పట్టణంలోని రిక్షాకాలనీ, బస్‌స్టేషన్ ఏరియా, త్రిశూల్‌పహాడ్, నౌగాం బస్తీ, లారీచౌక్, మండలంలోని డాడానగర్, కోసిని తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు పలువురిపై ఇటీవల దాడిచేసి కరిచాయి. కుక్కల దాడిలో ఒక్క ఆదివారం 9 మంది గాయపడ్డారు. వీరిలో రిక్షా కాలనీకిచెందిన షబానా బేగంకు తీవ్రగాయాలయ్యాయి. పట్టణంలోని బస్‌స్టేషన్ నుంచి డాడానగర్, కోసిని ప్రాంతాల్లో కుక్కల బెడద అధికంగా ఉందని, ఈ ప్రాంతంలో పలు హాస్టళ్లు, పాఠశాలలు ఉన్నాయని దీంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందంటున్నారు. ఆయా కాలనీల్లో వీధి కుక్కలు వాహనదారులను వెంబడించి కరుస్తున్నాయని ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆయాకాలనీల వాసులు ఆరోపిస్తున్నారు.

గుంపులు గుంపులుగా స్వైరవిహారం..

ఆయాకాలనీల్లో కుక్కలు రాత్రివేళల్లో గుంపులు, గుంపులుగా తిరుగుతూ స్వైరవిహారం చేస్తున్నాయని పట్టణవాసులు పేర్కొంటున్నారు. మేకలు, కోళ్లు కూడా కుక్కలదాడికి గురవుతున్నాయని వెంటనే అదుపుచేయాలని కోరుతున్నారు. కేవలం నెలవ్యవధిలోనే ఎంతో మంది వీధికుక్కల దాడికి గురైన సంఘటనలు ఉన్నాయి. కాగజ్‌నగర్ మార్కెట్ ఏరియాతోపాటు ద్వారకానగర్, సర్‌సిల్క్, కౌసర్‌నగర్, మండలంలోని రాంనగర్, డాడానగర్, కోసినితోపాటు పట్టణంలోని పలుకాలనీల్లో కుక్కల బెడదకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. రిక్షా కాలనీలో ఇద్దరిపై, నౌగాం బస్తీలో ముగ్గురిని, లారీచౌక్ ఏరియాలో ఇద్దరిని, డాడానగర్ ఏరియాలో ఇద్దరిపై వీధికుక్కలు దాడిచేసి గాయపరిచాయి. గాయపడ్డ 9మందికి స్థానిక సీహెచ్‌సీలో చికిత్సలు నిర్వహించారు.

ఇటీవల కుక్కల బెడద తీవ్రమైనట్లు ఒక్క రోజులోనే పదుల సంఖ్యలో బాధితులు ఆసుపత్రికి వస్తున్నారని, గతనెలలో ఒక్క రోజే 15మందిని కరిచాయని వైద్యసిబ్బంది పేర్కొంటున్నారు. కుక్కల బెడద తీవ్రం అవుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయా కాలనీవాసులు అలీమోద్దీన్, గౌస్ తదితరులు ఆరోపించారు. ఇప్పటికైనా చర్యలు తీసు కోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.





కుక్కల బెడదను నివారించాలి.. అలీముద్దీన్, కాగజ్‌నగర్

మాకాలనీలో కుక్కల బెదడతో హడలిపోతున్నాం. నిత్యం గుంపులు గుంపులుగా వస్తున్నాయి. మేకలు, కాలనీవాసులపై దాడులు చేస్తు న్నాయి. రక్షిం చేందుకు వెళితే దాడిచేస్తున్నాయి. హాస్టళ్లలో విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దయచేసి కుక్కల బెడద నుంచి కాపాడాలి.



నిస్సహాయ స్థితిలో ఉన్నాం.. ఇలియాజ్, రిక్షా కాలనీ

కాగజ్‌నగర్‌లోని రిక్షా కాలనీలో మాఅమ్మపై కుక్కలు దాడిచేసి కరుస్తుంటే నిస్సహా స్థితిలో ఉండిపోయా, కళ్లముందే పలువురిని కుక్కలు కరిచాయి. కాలనీలో వీరవిహారం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రాత్రివేళల్లో భయంభయంగా కాలం గడుపుతున్నాం.

ముగిసిన వర్షవాస్

సిర్పూర్(టి), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలో మూడు నెలలుగా మండల బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వర్షవాస్ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ బుద్ధుడిమార్గంతోనే ప్రతిఒక్కరి జీవనంలో సుఖమయ జీవితం కలుగుతుందన్నారు. వర్షవాస్ కార్యక్రమాలతో అంబేద్కర్‌మార్గంలో ప్రశ్నించే తత్వం లభిస్తుందన్నారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బౌద్ధమహాసభఅధ్యక్షుడు రాజు, బౌద్ధఉపాసక్‌లు, అభిమానులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

29న క్రీడాకారుల ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో ఈనెల 29న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19విభాగంలో పలు క్రీడా పోటీల కోసం క్రీడాకారులకు ఎంపిక పోటీలునిర్వహిస్తామని డీఐఈవో కల్యాణి, ప్రిన్సిపాల్ మహేశ్వర్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని మోడల్‌స్కూల్ క్రీడా మైదానంలో నెట్‌బాల్,ఖోఖో క్రీడాకారుల ఎంపికపోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులు పీడీ బి తిరుపతికి రిపోర్టు చేయాలన్నారు. అలాగే టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ బాలురపాఠశాలలో సాఫ్ట్ బాల్, బేస్‌బాల్‌క్రీడాకారులఎంపిక జరుగుతుందని, క్రీడాకారులు పీడీ శంకర్, పీఈటీ యాదగిరికి రిపోర్టు చేయాలన్నారు. అలాగే టీజీటీడబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాలలో ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికచేస్తామని, కోచ్‌రవి, పీడీ భవితల్‌కు క్రీడాకారులు రిపోర్టు చేయాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు చర్యలు

కాగజ్‌నగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు కాగజ్‌నగర్ మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఇంటికి గతంలోనే తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించేందుకు రెండు చిన్నపాటి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. తడి చెత్త ద్వారా కంపోస్టును తయారు చేస్తున్నారు. పొడి చెత్తలో సేకరించిన ప్లాస్టిక్, ఇనుమును స్ర్కాప్‌గా విక్రయిస్తున్నారు. పర్యావరణ ఇంజనీర్ ప్రణీల్ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్త సేకరణ, కంపోస్టు తయారీ జరుగుతోంది.


సేకరించిన తడిచెత్తతో తయారైన ఎరువు

మోడల్ లైబ్రరీలు ప్రారంభం


బెజ్జూరు: లైబ్రరీని ప్రారంభిస్తున్న ఎంఈవో సునీత

బెజ్జూరు/కౌటాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలం లోని బారెగూడ, కౌటాల మండలకేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో శనివారం రూమ్‌టురీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని ఎంఈవోలు సునీత, హనుమంతు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుస్తకపఠనం వల్ల పిల్లలకు ఆలోచన, ఊహాశక్తి, కొత్తపదాలు తెలుసుకోవచ్చన్నారు. లైబ్రరీలో సుమారు 600తెలుగు, ఇంగ్లీష్ పుస్తకాలు, చిత్రాలు వేయడానికి సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా రూంటు రీడ్ స్వచ్ఛంద సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మధ్యాహ్నబోజనాన్ని పరిశీలించారు. మెనూప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు అరవింద్, నానాజీ, లక్ష్మణ్, సీఆర్పీలు సత్యనారాయణ, శ్రీవాణి, రూంటు రీడ్ జిల్లా ఇన్‌చార్జి జెన్నిఫర్, కోఆర్డినేటర్స్ వెంకన్న, చంద్రశేఖర్, సంపత్,పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వారసంతలో దీపావళి సందడి

సిర్పూర్(టి), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన వారసంతలో దీపావళి సందడి నెలకొంది. పండుగ దగ్గర పడుతుండడంతో పలుగ్రామాలకు చెందిన వారు వారసంతలో వివిధ ఆకారంలో ఉన్న ప్రమిదలను, రంగుల దుకాణాలను ఏర్పాటు చేశారు. దీంతో మండలంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వాటి కొనుగోలుకు ఆసక్తి చూపారు.


వారసంతలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు


రోడ్డు పక్కన ప్రమాదకంగా ఉన్న గుంత

ఆదమరిస్తే అంతే..

సిర్పూర్(టి), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్-సిర్పూర్(టి) ప్రధాన రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో కురిసిన వర్షాలతో రోడ్డుకు ఒకపక్కన కోతగురై భారీగుంత ఏర్పడింది. వాహనదారులు ఆదమరిచే వస్తేగుంతలో పడి ప్రమాదం జరిగే అవకాశంఉంది. ఇకనైనా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకొని గుంతను పూడ్చి వేయాలని, లేదా హెచ్చరికబోర్డులు ఏర్పాటుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



జేఎంఈటీలకు పదోన్నతులు కల్పించాలి

శ్రీరాంపూర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జూనియర్ మైనింగ్ ఇంజనీర్(ట్రైనీ)లకు ఓవర్‌మెన్లుగా పదోన్నతులు కల్పించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు, శ్రీరాంపూర్ బ్రాంచ్‌కార్యదర్శి గూళ్ల బాలాజీ కోరారు. ఈమేరకు వారు హైదరాబాద్‌లో సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్, ప్లానింగ్, పా)కు వినతిపత్రం అందించారు. ఏడేళ్ల క్రిందట జేఎంఈటీలుగా సంస్థలో ఉద్యోగులుగా చేరినవారిలో కొందరికి ఓవర్‌మెన్లుగా పదోన్న తులుగా కల్పించారని, మిగిలిన వారికి ఇవ్వలేదన్నారు. ఖాళీలు ఉన్నప్పటికీ పదోన్నతులు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఖాళీలు లేకున్నా గ్రేడ్‌పదోన్నతి అయినా ఇవ్వాల్సి ఉందన్నారు. కార్మికులకు, యాజమాన్యానికి వారధులుగా ఉండే మైనింగ్ స్టాఫ్‌ను ఇబ్బందులకు గురిచేయడం వల్ల సంస్థకు నష్టం జరుగుతుందన్నారు. వెంటనేస్పందించి పదోన్నతులు కల్పించాలని కోరగా, డైరెక్టర్ సమ్మతించినట్లు నాయకులు పేర్కొన్నారు.

రిటైర్డ్ కార్మికులకు నగదు పారితోషికం ఇవ్వండి

శ్రీరాంపూర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విశ్రాంత కార్మికులకు నగదుపారితోషికం ఇవ్వాలని సింగరేణి విశ్రాంతఉద్యోగుల సంక్షేమ సంఘం ఉపప్రధానకార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్ ఒక ప్రకటనలో కోరారు. సింగరేణి పర్మినెంటు కార్మికులకు లాభాల వాటా, దసరా, దీపావళీబోనస్‌ఇచ్చిన యాజమాన్యం విశ్రాంత కార్మికులకు ఎందుకు ఇవ్వలేదన్నారు. తాముకూడా గతంలో పర్మనెంట్ కార్మికులమేనని, తమడాటా సింగరేణి సంస్థ వద్ద ఉంటుందని తెలిపారు. అలాంట ప్పుడు పారితోషికాలు చెల్లించేందుకు ఆలస్యం చేయడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. ప్రతిఏడాది ఇదేమాదిరిగా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు డబ్బులు చెల్లించిన సమయంలోనే తమకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

సీఎండీని కలిసిన కాంపెల్లి

మందమర్రి టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సింగరేణి సీఎండీ బలరాంను ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటి సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య శనివారం హైదరాబాద్‌లో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సింగరేణిలో కార్మికులకు సంబంధించిన ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సింగరేణిలో కార్మికులు మూడునుంచి నాలుగు దశాబ్దాలుగా పని చేసి విరమణ పొందిన తర్వాత క్వార్టర్లను ఖాళీచేయడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సొంతింటికలను నెరవేర్చాలన్నారు. దీనిపై సీఎండీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఈఎస్ఐ సౌకర్యం కల్పించండి: ఎస్‌సీకేఎస్

శ్రీరాంపూర్/మందమర్రి టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఈఎస్ఐకి ఆరునెలల అడ్వాన్స్‌ను సింగరేణి యాజమాన్యం చెల్లించి కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం(ఎస్‌సీకేఎస్-సీఐటీయూ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి మధు కోరారు. ఈ మేరకు ఆయన సింగరేణి సీఎండీ ఎన్ బలరాంను కలిసి వినతిపత్రం అందించారు. ఈఎస్ఐ అమలుకు రెండేళ్ల క్రితమే లేబర్ కమిషనర్ వద్ద ఒప్పందం కుదరగా, సింగరేణి యాజమాన్యం ఆరు నెలల అడ్వాన్సు డబ్బులు చెల్లించి, ఈఎస్ఐ కోడ్ తీసుకోవాల్సి ఉండన్నారు. కానీ యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. సీఐటీయూ నాయకుల విన్నపానికి స్పందించిన సీఎండీ కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ అమలు చేసేందుకు తక్షణం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాష్ట్రకార్యదర్శి గట్టు మహేందర్, రాష్ట్రకమిటీ సభ్యుడు సమ్మన్న, తదితరులు ఉన్నారు.


సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహిళలకు కోరుకున్న ఉద్యోగాల్లో శిక్షణ


మహిళా ఉద్యోగులకు కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్‌వోటూ జీఎం

మందమర్రిటౌన్, అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా సంస ప్రగతి, మహిళా ఉద్యోగుల సంక్షేమం కోసం వారు కోరుకున్న ఉద్యోగాల్లో యాజమాన్యం శిక్షణ ఇచ్చి అందులో స్థిరపడేలా చేస్తుందని ఎస్‌వోటూ జీఎం రాజే శ్వర్‌రెడ్డి, పర్సనల్‌మేనేజర్ శ్యాంసుందర్, డీజీఎం ఐఈడీ రాజన్న తెలిపారు. శనివారం కేకేఓసీలో మహిళా ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉపరితలంకు సంబంధించి 16పైగా డిసిగ్నేషన్‌లలో మహిళా ఉద్యోగులకు అందులో అవకాశాలు కల్పించడం కోసం యాజమాన్యం శిక్షణకు శ్రీకారం చుట్టిందన్నారు. దీనిని మహిళా ఉద్యోగులు ముందుకు వచ్చి సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఇక నుంచి సింగరేణిలో ఉద్యోగ నియామకాలు సర్ఫేస్‌లో 16డిసిగ్నేషన్‌లకు సంబంధించి యాజమాన్యం ఒక కమిటీ వేసిందని, సింగరేణి వ్యాప్తంగా ఈ కమిటీ ప్రస్తుతం పనిచేస్తున్న బదిలీ మహిళావర్కర్లు, జనరల్ మజ్దూర్‌లకు వివరిస్తుందన్నారు. చాలామందికి ఇటీవల వారివారి విద్యార్హతలనుబట్టి కూడా గనుల, డిపార్టుమెంట్ల కార్యాలయాల్లో అవకాశాలు కల్పించామన్నారు. ప్రస్తుతం ఈ డిసిగ్నేషన్లకు సంబంధించి ఆసక్తి చూపాలని తెలిపారు. ఈ అవకాశం పోతే తిరిగి రాదని తెలిపారు. చేరేవారు ముందుగా పేర్లు కూడా నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కేకే ఓసీ ప్రాజెక్టు అధికారి మల్లయ్య, గని మేనేజర్ రామరాజు, ఏరియా ఆసుపత్రి వైద్యురాలు జయవాణి, పిట్ కార్యదర్శి కుమారస్వామి, సంక్షేమాధికారి సందీప్, తదితరులు పాల్గొన్నారు.

'ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి'

మందమర్రి టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): హాకీలో భారత దేశానికి ఒలంపిక్‌లో ఏడుసార్లు గోల్డ్ మెడల్ సాధించిన దివంగత హాకీ క్యాప్టెన్ ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంవీటీసీ మేనేజర్ శంకర్ తెలిపారు. శనివారం సింగరేణి పాఠశాలలో ఏరియా వార్షికక్రీడల్లో భాగంగా హాకీ పోటీలకు ఆయన హాజరై మాట్లాడారు. యాజమాన్యం క్రీడాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కోల్ ఇండియాలో పథకాలు సాధించే క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తుందన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న యువత సీనియర్‌క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని సింగరేణి పతాకాన్ని కోల్ ఇండియాలో ఎగరవేయాలన్నారు. కార్యక్ర మంలో బెల్లంపల్లి బ్రాంచి సెక్రెటరీ దాగం మల్లేష్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అవకాశం కల్పించరా..?

(5వ పేజీ తరువాయి)



తాము గీసిన చిత్రపటాన్ని సీఎంకు అందజేస్తున్న శిక్షణ అభ్యర్థులు (ఫైల్)

యేటా శిక్షణ తరగతులు

కనీస అర్హతలు ఉండి, పై విభాగాల్లో ట్రైనింగ్ చేయదలచిన అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వాలు క్రమం తప్పకుండా యేటా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా రెండు సంవత్సరాల పాటు లోయర్, హయ్యర్ పరీక్షలు నిర్వహించి ప్రతి వేసవిలో 45 రోజుల పాటు టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ సర్టిఫికేట్ కోర్స్ (టీటీసీ) నిర్వహిస్తున్నాయి. అనంతరం యోగ్యతా పరీక్షలు నిర్వహించి అర్హులకు సర్టిఫికెట్లు కూడా అందజేస్తున్నాయి. సర్టిఫికెట్ ఉన్న వారు మాత్రమే డీఎస్సీలో ఉద్యోగాలకు అర్హులవుతారు. టీటీసీ శిక్షణ పొందిన అభ్యర్థులు రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది ఉన్నారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన ఐదు సెంటర్లు హైదరాబాద్‌లోని గాంధీ భవన్ సమీపంలోని ఉర్దూ స్కూల్‌తోపాటు నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండల్లో ఎస్సెస్సీ బోర్డు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి సెంటర్ నుంచి యేటా 1500 నుంచి 2000 వరకు పట్టభద్రులు బయ టకు వస్తుండగా, మంచిర్యాలతో సహా ప్రతి జిల్లాలో కనీసం 6 వేల మంది వరకు శిక్షణ పొందిన అభ్యర్థులు ఉన్నారు. క్రమం తప్పకుండా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ప్రభుత్వాలు ఆయా రంగాల్లో ప్రావీణ్యం సంపా దించిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించడం లేదు. డీఎస్సీల్లో పోస్టులు కేటాయించకపోవడంతో వారంతా నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారు.

ఆందోళనబాటలో అభ్యర్థులు

తమ సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఆందోళనబాట పట్టే యోచనలో ఉన్నారు. కలెక్టరేట్లలో నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌లో వినతులు సమర్పి చండంతోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులను కలిసి డీఎస్సీలో అవకాశం కల్పించాలని వేడుకున్నారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేసేందుకు వారంతా సన్నద్ధమవుతున్నారు. పోస్టులు కేటాయించాలని పలు మార్లు ధర్నాలు నిర్వహించారు.

నియామకాలు చేపట్టాలి...

రాజన్‌చంద్ర, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ నిరుద్యోగ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు



డీఎస్సీల్లో ఖాళీగా ఉన్న ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ పోస్టులను భర్తీ చేయాలి. ప్రైవేట్ పాఠశాలల్లోనూ పై విభాగాల్లో ఉద్యోగులను నియమించేలా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వపరంగా శిక్షణ పొందిన లక్షలాది మందికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధిలేక దుర్భర జీవితం గడపాల్సి వస్తోంది. యేటా ప్రభుత్వమే శిక్షణ తరగతులు నిర్వహిస్తూ డీఎస్సీల్లో పోస్టులు కేటాయించక పోవడం సమంజసం కాదు. ఇప్పటికైనా ప్రభుత్వం డీఎస్సీలో పోస్టులు కేటాయించడంతోపాటు నిర్ణీత వయస్సులో సడలింపు కల్పించాలి.

బెల్లంపల్లిలో ఐటీ కంపెనీ

ఐటీ ఉద్యోగం అంటేనే హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు వెళ్ళాల్సి ఉంటుంది. అందుకు భిన్నంగా బెల్లంపల్లిలో ఐటీ కంపెనీ ఏర్పాటు చేశారు బెల్లంపల్లికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు. వీరితోపాటు వీరి భార్యలు ఉన్నత చదువులు, ఉద్యోగాలు చేస్తున్న వారు వాటిని వదిలేసి స్థానికంగా కంపెనీ ప్రారంభించారు. దీంతో వంద మందికి పైగా స్థానిక యువత కంపెనీలో ఉపాధి పొందుతున్నారు.



- ఉన్నత ఉద్యోగాలను వదిలి ఏర్పాటు
- స్థానికంగా పలువురికి ఉపాధి



శ్రీరంగనాధరాజు, శ్రీనాధరాజు, సాయినాధరాజు

బెల్లంపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన ఎర్ర శ్రీధర్‌రాజు-శ్రీదేవి దంపతులకు శ్రీరంగనాధ రాజు, శ్రీనాధరాజు, సాయినాధరాజు ముగ్గురు కుమారులు. వీరు ఉన్నత చదువులు చదివి పలు ఐటీ కంపెనీల్లో ఉన్నత ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. వివాహాల అనంతరం వీరి భార్యలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా, లెక్చరర్‌గా పని చేస్తున్నారు. అందరూ ఐదంకెల వేతనంతో పని చేస్తున్నారు. అయితే పండుగలు, శుభకార్యాలకు బెల్లంపల్లికి వచ్చేవారు. ఈ క్రమంలో వీరికి ఇక్కడే ఐటీ కంపెనీ ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చింది. దీంతో ముగ్గురు సోదరులు ఒక నిర్ణయానికి వచ్చి ఐటీ కంపెనిని నెలకొల్పారు.

ఐటీ కంపెనీ ఏర్పాటు

సనాతన అనలైటిక్స్ రిక్రూట్‌మెంట్ హెచ్‌టూ హెచ్ సొల్యూషన్స్, షాప్ అండ్ మి డెవలప్‌మెంట్ సంస్థను 2017లో ఏర్పాటుచేశారు. ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ప్రకటనలు చేయడంతో నియోజకవర్గంలోని ఆయా మండలాలతో పాటు మంచిర్యాల, గోదావరిఖని నుంచి యువతీ యువకులు ఇంట ర్వ్యూలకు హాజరయ్యారు. ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్ చేసిన వారిని విధుల్లో చేర్చుకున్నారు. 80కి పైగా ఐటీ కంపెనీలకు వీరు సేవలు అందిస్తున్నారు. అలాగే షాప్ అండ్‌మి ద్వారా బెల్లంపల్లి, మంచిర్యాల పరిసర ప్రాంతాల్లో పది వేల మందికి పైగా కస్టమర్లకు డెలివరీ సేవలు అందిస్తున్నారు. ఇందులో వందకు పైగా కంపెనీలతో వీరు అనుసంధానమయ్యారు. ఎకనామిక్స్ రీసర్చ్, సియామ్, టీవీఎస్ గ్రూపుతో పాటు ఎన్నో ఇతర ఆటోమొబైల్స్ కంపెనీలకు బిజినెస్ డెవలప్‌మెంట్ రీసర్చ్ సర్వీస్ అందిస్తున్నారు. వివిధ ఐటీ, ఆటో మొబైల్ కంపెనీలతో అగ్రిమెంట్ చేసుకోవడంతో స్థానికులకు ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. కరోనా సమయంలో నిత్యావసర వస్తువులను పంపిణీ చేయడమే కాకుండా పాఠశాలలకు వాటర్ ట్యాంకులు, ఆయా గ్రామాల్లో చెత్త సేకరణ బుట్టలను అందిస్తూ సమాజ సేవలో భాగస్వాములవుతున్నారు.



ఐటీ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులు

స్థానికులకు ఉపాధి

శ్రీరంగనాధ రాజు, సనాతన అనలైటిక్స్ ఐటీ రిక్రూట్‌మెంట్ సంస్థ సీఈవో



స్థానికంగా ఐటీ కంపెనీ ఏర్పాటు చేసి స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలనే ఆలోచన వచ్చింది. ఉద్యోగరీత్యా అన్నదమ్ములం వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు చేశాం. ఐటీ కంపెనీపై పూర్తి అవగాహన వచ్చింది. అందరం కలిసి ఐటీ కంపెనీ ఏర్పాటు చేసి పలువురికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం.

కుటుంబ సభ్యులతో ఉంటున్నా

తేజసాయిష్, ఐటీ ఉద్యోగి



తల్లిదండ్రులు ఉన్నత చదువులను ఇతర ప్రాంతాల్లో చదివించారు. హైద్రాబాద్‌లోని ఓ ఐటీ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నాననే బాధ ఉండేది. బెల్లంపల్లిలో ఐటీ కంపెనీ ఏర్పాటు చేశారని తెలియడంతో ఇక్కడ జాయినయ్యాను. స్థానికంగా ఐటీ కంపెనీ ఏర్పాటుతో తల్లిదండ్రుల వద్ద ఉంటూ ఉద్యోగం చేస్తున్నా.

చదువుకు ఫలితం దక్కింది

కొట్టె లావణ్య, ఐటీ కంపెనీ టీమ్ లీడర్



ఏడు సంవత్సరాలుగా స్థానిక ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. ఎంబీఏ చదివిన తర్వాత వివాహమైంది. చదువుకు తగిన ఉద్యోగం స్థానికంగా లేకపోవడం, ఇతర ప్రాంతాలకు వెళ్ళి ఉద్యోగం చేయడానికి వీలులేకపోవడం బాధగా ఉండేది. స్థానికంగా ఐటీ కంపెనీలో ఉద్యోగం రావడంతో చదివిన చదువుకు ఫలితం దక్కింది.

ఉద్యోగాకాశాలు మెరుగు పడుతున్నాయి

అనూష, ఐటీ ఉద్యోగి, గోదావరిఖని



ఎంటెక్ చదివాను. వివాహం అయిన తర్వాత అత్తగారిల్లు అయిన బెల్లంపల్లికి వచ్చాను. ఉద్యోగం చేయలేకపోతున్నానే బాధ ఉండేది. స్థానికంగా ఐటీ కంపెనీ ఏర్పాటు చేయడంతో కుటుంబీకుల ప్రోత్సాహంతో కంపెనీలో జాయిన్ అయ్యాను. 6 సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తున్నాను.

న్యూస్ బాక్స్

మెరిట్ జాబితాపై అభ్యంతరాలుంటే తెలుపండి

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులను ప్రాథమిక మెరిట్ జాబితా విడుదల చేశామని జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షకులు డాక్టర్ ఎం.కోటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ జాబితాను జిల్లా అధికారిక వెబ్‌సైట్ http://mancherial.telangana.gov.in లో, కార్యాలయ నోటీస్ బోర్డులో ప్రదర్శించామన్నారు. ప్రాథమిక మెరిట్ జాబితాపై అభ్యంతరాలుంటే ఈ నెల 30వ తేదీలోగా కలెక్టరేట్‌లోని జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం పర్యవేక్షకులకు రాత పూర్వకంగా సమర్పించాలని తెలిపారు.

అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రి టౌన్, అక్టోబరు 26: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న ట్రేడ్‌లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో 7వ దఫా అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తామని, అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసి సీటు పొందిన తర్వాత మార్పులు, చేర్పులకు అవకాశం ఉండదన్నారు. ఐటీఐలో డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడ్‌లో 13, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ మెకానికల్ ఏటీసీ ట్రేడ్‌లో 14 ఖాళీలు ఉన్నాయని, ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తా

జన్నారం, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం స్లేట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్సీగా గెలిచిన వాళ్ల నిరుద్యోగులతోపాటు ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించ డంలో విఫలమయ్యారన్నారు. సమావేశంలో ట్రస్మా సభ్యులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సాధారణ సమావేశం



సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్

రామకృష్ణాపూర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): క్యాతన్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో 11 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారని తెలిపారు. కమిషనర్ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ విద్యాసాగర్, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, మేనేజర్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

కాసిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు దాగాం శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.8,200 కోట్లు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందన్నారు. దీంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో కొన్ని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు చదువు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. దీంతో మధ్యతరగతి కుటుంబాలు చదువును మధ్యలోనే నిలిపి వేస్తున్నారన్నారు. ప్రభుత్వం బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. హర్షిత్, నవీన్, రాజేందర్ పాల్గొన్నారు.

గిరిజన సంప్రదాయాలను కాపాడేది ఆదివాసీలే





కాకో అమ్మవారిని దర్శించుకొంటున్న డీసీసీ చైర్మన్ తిరుపతి , కాకో అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

దండేపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడేది ఆదివాసీలేనని రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. గుడిరేవులోని పద్మల్‌పూరీ కాకో ఆలయాన్ని శనివారం సందర్శించారు. గిరిజన సంప్రదాబద్ధంగా గుస్సాడీతో స్వాగతం పలికారు. ఆయన గుస్సాడీ వేషధారణ ధరించి గిరిజనులతో కలిసి నృత్యాలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసి గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దర్శనం అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు, గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 28న గుస్సాడి దండారీ దర్బార్ నిర్వహణపై గిరిజనులతో చర్చించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, సభ్యులు, ఉమ్మడి జిల్లాల ఆదివాసి గిరిజన పటేల్, గిరిజనులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కాకో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు గుస్సాడిలతో గిరిజన సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి రూ.32లక్షల నిధులను మంజూరు చేశానన్నారు. కాసనగొట్ల లింగన్న, చుంచు శ్రీనివాస్, అనిల్‌కుమార్, గొట్ల భూమన్నయాదవ్ పాల్గొన్నారు.

పద్మల్‌పూరీ కాకో ఆలయాన్ని సీఐ అల్లం నరేందర్, ఎస్సై ఉదయ్‌కిరణ్‌లు సందర్శించారు. గుస్సాడీ వేషధారణతో ఆలయం వరకు ఘన స్వాగతం పలికారు. కాకో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. దండారీ గుస్సాడి దర్బార్ ఏర్పాటుపై ఆరా తీశారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బెల్లంపల్లి, అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి): పెద్దనపల్లి శివారులోని జాతీయ రహదారి పక్కన వాగుపై వంతెన నిర్మాణం చేపట్టిన కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో, ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి వంతెనపై కొందరు వ్యక్తులు వంతెన నిర్మించారని, వెంటనే కూల్చివేయాలని కోరారు. వాల్టా చట్టం ఉల్లంఘించినందుకు చట్టపర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. నాయకులు కోడి రమేష్, సంపత్, రాంచందర్, బాలరాజు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కర్రసాము

- శిక్షణపై బాలికలు, యువతుల్లో ఆసక్తి
- ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు
- ఆత్మవిశ్వాసం పెంపొందేందుకు తోడ్పాటు
- బరువు తగ్గడం, దేహదారుఢ్యానికి దోహదం





కర్రసాము శిక్షణ పొందుతున్న బాల, బాలికలు

మంచిర్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్రసాము అనేది అతి ప్రాచీనమైన యుద్ధ కళ. ప్రత్యర్థుల దాడులను తిప్పి కొట్టేందుకు, జంతువుల దాడి నుంచి రక్షణకు కర్రసాము నేర్చుకునేవారు. కర్రసాముతో బరువు తగ్గడంతోపాటు కీళ్లు, ఎముకల పటుత్వం, ఏకాగ్రత పెరుగుతాయి. ఏదైనా అపాయం ఎదురైతే సమర్థంగా ఎదుర్కొనగలమనే ఆత్మవిశ్వాసం కలుగుతుంది. కొన్ని దశాబ్దాల క్రితం వరకు కర్రసాముకు విశేషమైన ఆదరణ ఉండేది. గ్రామాలు, పట్టణాల్లో కర్రసాము పోటీలు జరుగుతుండేవి. జాతరలు, పండుగలు జరిగితే కర్ర సాము ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. కాలక్రమేణా కర్రసాము మరుగున పడిపోయింది. ప్రస్తుతం కర్రసాముపై యువతలో ఆసక్తి పెరుగుతోంది. ఆత్మరక్షణతోపాటు ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు దోహదపడుతుండటంతో తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తున్నారు. కర్రసాములో నైపుణ్యం పెంచుకోవడం ద్వారా కొందరు క్రీడాకారిణిలు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలో పాల్గొంటున్నారు.

పెరుగుతున్న ఆసక్తి

ఇటీవల కాలంలో కర్రసాము (సిలంబం)కు ఆదరణ పెరుగుతోంది. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల్లో కర్ర సాము సంఘాలు ఏర్పాట య్యాయి. తెలంగాణలో 2018లో పుస్కూర్ రామ్మోహన్ రావు అధ్యక్షుడిగా, కనపర్తి రమేష్ ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర సంఘాన్ని ఏర్పాటు చేయగా ఇప్పటి వరకు ఐదు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఇక్కడి క్రీడాకారులు ఎంపికయ్యారు. చెన్నైలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ జట్టు ఆల్ ఇండియా ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచింది. పురుషులతో సమానంగా బాలికలు, యువతులు కర్రసాము నేర్చుకోవడానికి పోటీప డుతున్నారు. కర్రసాములో నైపుణ్యం కలిగిన వారిలో కొందరు శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు.

ఎనిమిదేళ్లుగా శిక్షణ పొందుతున్నా

పులిశెట్టి శృతి, డిగ్రీ విద్యార్థిని, మంచిర్యాల



ఎనిమిదేళ్లుగా కర్రసాములో శిక్షణ పొందుతున్నా. అమ్మా, నాన్నలు కూడా కర్రసాము నేర్చుకునేందుకు ప్రోత్సహిస్తున్నారు. 7వ తరగతి లోనే కర్రసాము శిక్షణ పొందడం ప్రారంభించాను. ఆత్మరక్షణలో భాగంగా ఎవరినైనా ఎదిరించగలననే నమ్మకం ఏర్పడింది. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నా.

కర్రసాముకు ఆదరణ పెరుగుతోంది

కోచ్, కనపర్తి రమేష్



కర్రసాముకు క్రమంగా ఆదరణ పెరుగుతోంది. కర్రసాములో నైపుణ్యం సాధిస్తే ఆత్మ రక్షణతోపాటు ఆత్మవిశాసం పెరుగుతుంది. ప్రాచీన యుద్ధకళను బతికించాలనే ఉద్దేశంతో శిక్షణ ఇవ్వడం ప్రారంభించాను.

క్రీడా సమాచారం

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక




ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కాసిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కాసిపేట మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపాల్ అబ్దుల్‌ఖలీల్ తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఠాగూర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన అండర్-19 ఫుట్‌బాల్ పోటీల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం సీఈసీ విద్యార్థి పి.ప్రశాంత్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. మంచిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్ 17 క్రికెట్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థి కె.రూపక్ ప్రతిభ కనబరచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు.

ఈ నెల 29న జిల్లాస్థాయి రెజ్లింగ్ ఎంపిక పోటీలు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠ శాలలో అండర్-14, 17 బాలుర జిల్లాస్థాయి రెజ్లింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సిహెచ్.ఫణిరాజా, పాఠశాల హెచ్‌ఎం, కన్వీనర్ పద్మజ, పీడీ రేణిగుంట రాజయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 జనవరి 2008 తర్వాత జన్మించి 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు పోటీలకు అర్హులని, పాల్గొనే వారు ఉదయం 10 గంటలకు రిపోర్టు చేయాలని తెలిపారు. వివరాలకు 9704656009 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



అవకాశం కల్పించరా..?

- ఆర్ట్, క్రాఫ్ట్ ఉద్యోగ నియామకాలు చేపట్టని ప్రభుత్వం
- దశాబ్దాలుగా అభ్యర్థుల నిరీక్షణ
- ప్రభుత్వపరంగా యేటా శిక్షణ తరగతులు
- డీఎస్సీలో పోస్టులకు ప్రాధాన్యం ఇవ్వని వైనం



ఉద్యోగావకాశాలు కల్పించాలని ధర్నా (ఫైల్)

మంచిర్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శిక్షణ పూర్తి చేసుకున్న అర్హత గల ఆర్ట్, క్రాఫ్ట్ అభ్యర్థులు ప్రభుత్వ పాఠశాలల్లో నియామకాల కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో రిక్రూట్‌మెంట్ జరగగా అప్పటి నుంచి దాదాపు 35 సంవత్సరాలుగా నియామకాలు జరగలేదు. డీఎస్సీ నియామకాల్లో పోస్టులు కేటాయించకపోవడంతో ఆ ఉద్యోగాలపై ఆశలు పెట్టుకున్న అభ్యర్థులు తీవ్ర నిరాశ నిస్పృహలకు గురవుతున్నారు.

మూడు దశాబ్దాలకు పూర్వం ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో డ్రాయింగ్, లలితకళలు, మ్యూజిక్, టైల రింగ్, కుట్లు, అల్లికలు, మెకానిజం, ఎలక్ట్రీషియన్, తదితర నైపుణ్యతలను విద్యార్థులకు నేర్పేందుకు అర్హతగల టీచర్లను డీఎస్సీల ద్వారా నియమించేవారు. ఆయా కోర్సుల్లో చేరడం ద్వారా ఉన్నత చదువులు అభ్యసించ లేని పేద విద్యార్థులు వృత్తిరీత్యా తమ కాళ్లపై తాము నిలబడే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఆ పోస్టుల ప్రస్తావనే లేకుండా పోయింది. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాల్లో ప్రస్తుతం 1,733 పోస్టులు ఖాళీగా ఉండగా వారంతా డీఎస్సీపైనే ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమకు అవకాశం కల్పించాలని అభ్యర్థిస్తున్నారు.

మిగతా 7వ పేజీలో..

పెద్దపులి సంచారం

హాజీపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెద్దపులి సంచారం కలకలం రేపింది. ధర్మారం అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు ధ్రువీకరించారు. ధర్మారం నుంచి బుగ్గగట్టు, గుడిపేట, ర్యాలీ ప్రాజెక్ట్ వైపు అడుగు జాడల ఆధారంగా పెద్దపులి వెళ్లినట్లు అధికారులు భావిస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు డప్పు చాటింపు వేయించారు. పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలి, అడవికి వెల్లకూడదని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఫారెస్టు అధికారులు పేర్కొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు దండారీ దర్బార్ ఆహ్వానం



దండేపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గుడిరేవులో పద్మల్ పూరీ కాకో ఆలయంలో ఈనెల 28 సోమవారం నిర్వహించే గుస్సాడి దండారీ దర్బార్ ఉత్సవానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావులను ఆలయ కమిటీ నిర్వాహకులు శనివారం హైదరాబాద్‌లో కలిసి ఆహ్వాన పత్రాలను అందజేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిని సన్మానించారు. రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి, ఆలయ కమిటీ చైర్మన్ కుడిమేత సోముపటేల్, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు, రాయి సెంటర్ మండల అధ్యక్షుడు పెంద్రం శ్రీనివాస్‌లు ఉన్నారు.

సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం తనిఖీ



డాక్యుమెంట్‌ను పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావు శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల సరళిని తెలుసుకోవడంతోపాటు డాక్యుమెంట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా మంచిర్యాల కార్యాలయాన్ని తనిఖీ చేశామన్నారు. ఇటీవల పత్రికల్లో వెలువడిన పలు కథనాల నేపథ్యంలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌కు రెండు సార్లు మెమోలు జారీ చేశామని, ఆయన వివరణ ఇచ్చారని చెప్పారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించిన డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తామని, ఏమైనా అవకతవకలు జరిగినట్లు తెలితే బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

సివిల్ జడ్జి గృహాన్ని ప్రారంభించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



గృహాన్ని ప్రారంభిస్తున్న ప్రధాన న్యాయమూర్తి

బెల్లంపల్లి రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కన్నాల జాతీయ రహదారి పక్కన నిర్మించిన బెల్లంపల్లి సివిల్ జడ్జి గృహాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వేణుగోపాల్ ప్రారంభించారు. హైకోర్టు న్యాయమూర్తికి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చిప్ప మనోహర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. సివిల్ జడ్జి ముఖేష్, డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవో హరికృష్ణ, వివిధ శాఖల అధికారులు, బార్ అసోసియేషన్ నాయకులు చిప్ప మనోహర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు మంచినీటి సరఫరాలో అంతరాయం

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డులకు ఆదివారం మంచినీటి సరఫరాలో అంతరాయం కల్గుతుందని మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పైప్‌లైన్ల సాధారణ మరమ్మతు కారణంగా అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

బెల్లంపల్లిలో
ఐటీ కంపెనీ
ఉన్నత ఉద్యోగాలను వదిలి ఏర్పాటు
స్థానికంగా పలువురికి ఉపాధి
7

ఆత్మరక్షణకు
కర్రసాము
శిక్షణపై బాలికలు, యువతుల్లో ఆసక్తి
7

పిచ్చుకల తోరణం



దండేపల్లి మండలం ఆల్లీపూర్ గ్రామ సమీపంలో ఊర చెరువుల వద్ద విద్యుత్ తీగలపై పిచ్చుకలు వరుస క్రమంలో వాలి ఓ తోరణంలాగా చూపరులను ఆకట్టుకుంటున్నాయి, అలాగే తుమ్మ, ఈత చెట్లకు గిజిగాడు గూళ్లు అందంగా రూపుదిద్దుకుంటాయి. సన్నటి గడ్డి పరకలతో పిచ్చుకలు అందంగా తయారు చేసుకుంటాయి.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి)



విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంచడమే లక్ష్యం

నస్పూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించడమే లక్ష్యమని విద్యశాఖ అధికారులు అన్నారు. తీగల్ పహాడ్‌లోని మండల పరిషత్ పాఠశాలలో రూమ్‌టురీడ్ ఇండియా ట్రస్ట్ యుఎస్ఏఐడీ సహకారం, ఎస్ఇఆర్ఐ, ఎఫ్ఎల్ఎన్‌కు అనుబందంగా విద్యాశాఖ సమన్వయంతో మోడల్ లైబ్రరీని ఏర్పాటు చేశారు. శనివారం సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, మండల విద్యాధికారి రామన్నలతో కలిసి స్కూల్ కాంప్లెక్ ప్రధానోపాధ్యాయుడు దామోదర్ ప్రారంభించారు. విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల్లో చదవడం అలవాటు చేస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్టు ప్రతి మండలానికి మోడల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తోందన్నారు. లైబ్రరీలో వివిధ రకాల కథలతో కూడిన పుస్తకాలు, పిల్లల ఆలోచన పరిధిని పెంచుతాయన్నారు. పుస్తకాలు చదవడం వలన విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, రూమ్‌టురీడ్ కో ఆర్డినేటర్ కోట గీత, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ సంధ్య, ఉపాధ్యాయులు లీలావతి, అలివేలు మంగ, అఖిల పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ రామన్న

ప్లాట్ల యజమానులు ఎల్ఆర్ఎస్ పూర్తి చేసుకోవాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీవో బాపురావు

జైపూర్,అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్లాట్ల యజమానులు ఎల్ఆర్ఎస్ సర్వే పూర్తి చేసుకోవాలని, లేకుంటే బిల్డింగ్ అనుమతులు, ఇతరులకు విక్రయం చేయరాదని ఎంపీవో శ్రీపతి బాపురావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీరామ చంద్రమిషన్‌లో గల ప్లాట్ల సర్వేను పరిశీలించారు. ఈ మిషన్‌లో ఇప్పటి వరకు 80కి పైగా దరఖాస్తులు పూర్తి చేశామన్నారు. గ్రామ పంచాయతీలోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఈ నెల 31వరకు పూర్తి చేయాలని కార్యదర్శి ఉదయ్‌ని ఆదేశించారు. ఇరిగేషన్ ఏఈ దాసరి అఖిల, ప్లాట్ల యజమానులు ఉన్నారు.

నేతకానీలకు ప్రత్యేక కేటగిరి కేటాయించాలి



అభివాదం చేస్తున్న నాయకులు

జన్నారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేస్తే నేతకానీలకు ప్రత్యేక కేటగిరి కేటాయించాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్వర్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జాడి ముసలయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన మండల స్థాయి సమావేశంలో మాట్లాడారు. నేతకానీ కులం ఏ కులానికి ఉప కులం కాదని, నేతకానీల జనాభా 20 లక్షల వరకు ఉందని, జనాబా దామాషా ప్రకారం రిజర్వేషన్ కేటాయించాలని డిమాండ్ చేశారు. మాలలు తమ జనాభాను వారి ఖాతాలో వేసుకొని ఎక్కువ రిజర్వేషన్ పొందుతున్నారన్నారు. ఏ కులానికి ఇవ్వాల్సిన రిజర్వేషన్‌ను ఆ కులానికే కేటాయించాలన్నారు. సాయిని ప్రసాద్ నేత, అనపర్తి యువరాజ్, తాళ్లపల్లి రాజేశ్వర్, జాడి గంగాధర్, రత్నం లక్ష్మణ్, జాడి వెంకట్, బోర్లకుంట ప్రభుదాస్, బండారి స్వామి, దుర్గం వినోద్, మల్లయ్య, పాల్గొన్నారు.

క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ బదిలీ

రామకృష్ణాపూర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): క్యాతన్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న మురళీకృష్ణ శనివారం చెన్నూరు మున్సిపాలిటీకి బదిలీఅయ్యారు. క్యాతన్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జి.రాజు పదోన్నతిపై రానున్నారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ నుంచి మున్సిపల్ కమిషనర్ల బదిలీల జాబితాను విడుదల చేశారు.

చెన్నూరు మున్సిపల్ కమిషనర్..

చెన్నూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) చెన్నూరు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ బదిలీ అయ్యారు. సీడీఎంఏలో వెంటనే రిపోర్టు చేయాలని శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రామకృష్ణపూర్ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ చెన్నూరుకు బదిలీపై రానున్నారు. గంగాధర్ ఏడాది కాలంగా చెన్నూరులో పని చేస్తున్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం

గర్మిళ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఐఎన్‌టీయూసీ అనుబంధం 327 యూనియన్ స్టేట్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ పెద్ది రమేష్ పేర్కొన్నారు. శనివారం పాత మంచిర్యాలలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండాను అవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 327 యూనియన్ ఆవిర్భవించి 70 సంవత్సరాలు అవుతుందని పేర్కొన్నారు. 327 యూనియన్ ఇప్పటివరకు కార్మికుల సమస్యలను పరిష్కరించిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కంపెనీల్లో ఐఎన్‌టీయూసీ కార్మికులకు సేవలందిస్తుందని, విద్యుత్ శాఖలో ఆర్టిజన్లను మ్యాన్ కార్మికులను పర్మినెంట్ చేయించామన్నారు. రానున్న రోజుల్లో ఆర్టిజన్లు, జేఎల్ఎంల సమస్యలను, కార్మికుల సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. యూనియన్ నాయకులు సుదర్శన్, రామకృష్ణ, సురేష్, రవి, శ్రీనివాస్, శివ, తదితరులు పాల్గొన్నారు.